EVENING EDITION

సూర్య నేటి దినపత్రిక www.suryaa.com

4PM www.suryaa.com

మంగళవారం 11 జూన్ 2024 పేజీలు: 02







## అమరావతే రాజధాని..

# ఆర్థిక రాజధానిగా విశాఖ

### ఏపీలో విశాఖను ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేస్తాం

### నారా చంద్రబాబు నాయుడు

ఏపీలో కూటమి సర్కార్ కొలువుదీరబోతోంది. జూన్ 12న రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార చేయనున్నారు. ఇదిలా ఉండగా, మంగళవారం విజయవాడలో మూడు పార్టీల ఎమ్మెల్యేలు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా టీడీఎల్పీ నేతగా చంద్రబాబు నాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ.. ఏపీలో విశాఖను ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. అలాగే విశాఖను ఆధునిక నగరంగా తీర్చిదిద్దుతామని, కర్నూలును కూడా అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. ఎన్డీఏ శాసనసభ పక్ష నేతగా ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు. ఏపీ ప్రజలు గతంలో ఎప్పుడూ ఇవ్వని తీర్పునిచ్చారని, ఏపీ ప్రజలు ఐదేళ్లు విధ్వంసకర పాలన చూశారని, అత్యున్నత ఆశయాల కోసం 3 పార్టీలు ఏకమయ్యాయని అన్నారు. 1994లో ఏకపక్ష ఎన్నికలు జరిగినా ఇన్ని సీట్లు రాలేదని, చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా కడపలో 7కు 5 సీట్లు గెలిచాం.. అభ్యర్థులు గట్టిగా నిలబడ్డ చోట ప్రజలు ఆశీర్వదించారు.. ప్రజలు ఇచ్చిన తీర్పుతో ఢిల్లీలో మమ్మల్ని గౌరవించారని చంద్రబాబు అన్నారు. ఈ తీర్పుతో రాష్ట్ర గౌరవం పెరిగింది.. గెలిచే అభ్యర్థులకే సీట్లు కేటాయించాం.. టీడీపీ, జనసేన పొత్తు గురించి తొలిసారి చెప్పిన వ్యక్తి పవన్ అని గుర్తు చేశారు చంద్రబాబు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. గత ఐదేళ్లు ఏపీ ప్రజలు విపత్కర పరిస్థితులు చూశారని, ఏపీలో ఎన్డీఏ కూటమి విజయం దేశానికి స్ఫూర్తినిచ్చిందన్నారు. కూటమి అంటే ఎలా ఉండాలో ఏపీ ప్రజలు దేశానికి చూపించారన్నారు. ఒడిదుడుకులు ఎదుర్కొన్నాం, కావల్సిన చోట తగ్గాం.. 5 కోట్ల మంది ప్రజలు మనపై ఆశలు పెట్టుకున్నారని అన్నారు. ఇలాంటి సమయంలో సుదీర్ఘమైన అనుభవం ఉన్న నాయకుడు కావాలని, ఈ సమయంలో చంద్రబాబు నాయకత్వం, అనుభవం చాలా అవసరం అని పవన్ అన్నారు. మందుపాతరలు పేలినా బయటపడ్డ నాయకుడు చంద్రబాబు.. ఎన్డీఏ కూటమి నుంచి ముఖ్యమంత్రిగా చంద్రబాబును ప్రతిపాదిస్తున్నామని పవన్ కల్యాణ్ ప్రకటించారు.ఇక పురంధేశ్వరి మాట్లాడుతూ.. కూటమిగా అనూహ్య విజయం సాధించాం.. 3 పార్టీల కార్యకర్తలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నా.. గత ఐదేళ్లుగా నిజమైన సంక్షేమానికి ప్రజలు దూరమయ్యారు. ఇంతటి ఘన విజయం మనం ఊహించలేదని అన్నారు. మూడు పార్టీల కలయిక రాష్ట్రానికి అవసరమని ప్రజలు భావించారని ఆమె గుర్తు చేశారు.

### సమష్టిగా ప్రభుత్వాన్ని ముందుకు తీసుకెళదాం: పవన్ కల్యాణ్

గత ఐదేళ్లుగా రాష్ట్రంలో విపత్కర పరిస్థితులు తలెత్తాయని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కలిసి కట్టుగా పోరాడి అద్భుత విజయాన్ని సొంతం చేసుకుందని చెప్పారు. కూటమి శాసన సభాపక్ష నేతగా చంద్రబాబు పేరును ప్రతిపాదించిన అనంతరం పవన్ మాట్లాడారు. "టీడీపీ, జనసేన, బీజేపీ ఎమ్మెల్యేలకు శుభాకాంక్షలు. అందరం కలిసికట్టుగా పోరాడి అద్భుతమైన మెజారిటీలతో గెలిచాం. 164 శాసనసభ స్థానాలు, 21 ఎంపీలను ఎన్డీయే కూటమి దక్కించుకుంది. అద్భుతమైన విజయం ఇది. కూటమి అంటే ఎలా ఉండాలో రాష్ట్ర ప్రజలు కలిసికట్టుగా చూపించారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలనివ్వం అని ఇప్పటం సభలో చెప్పాం.. అదే మాటపై నిలబడ్డాం. ఒడుదొడుకులు ఎదుర్కొన్నాం.. తగ్గాం.. ప్రజల్లో నమ్మకాన్ని పెంచి అద్భుతమైన మెజారిటీతో ప్రభుత్వాన్ని స్థాపించబోతున్నాం. ఉమ్మడి మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను బాధ్యతగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది. ఇలాంటి సమయంలో సుదీర్ఘ అనుభవం ఉన్న నాయకుడు కావాలి. నాలుగు దశాబ్దాల అనుభవం, అభివృద్ధిపై అపారమైన అవగాహన, పెట్టుబడులను తీసుకొచ్చే సమర్థత, ప్రతిభ, విదేశాల అధ్యక్షులను తెలుగు రాష్ట్రాల వైపు దృష్టి మళ్లించే శక్తి ఉన్న చంద్రబాబు నాయకత్వం రాష్ట్రానికి చాలా అవసరం. ఆయన నలిగిపోయారు. జైల్లో చూశాను. అప్పుడు చంద్రబాబు సతీమణి భువనేశ్వరి పడిన బాధను చూశాను. మంచిరోజులు వస్తాయి.. కన్నీళ్లు పెట్టొద్దని చెప్పాను. ఆ రోజులు వచ్చాయి. చంద్రబాబుకు మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు చెబుతున్నా.. అద్భుతమైన పాలన అందివ్వాలని కోరుకుంటున్నా" అని చెప్పారు. ఈ సందర్భంగా పవన్‌ను చంద్రబాబు ఆలింగనం చేసుకుని ధన్యవాదాలు తెలిపారు.

### జనసేన శాసనసభాపక్ష నేతగా పవన్‌కల్యాణ్ ఎన్నిక

జనసేన శాసనసభాపక్ష నేతగా పవన్‌కల్యాణ్ ఎన్నికయ్యారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో జనసేన ఎమ్మెల్యేల సమావేశం నిర్వహించారు. పవన్‌ను శాసనసభాపక్ష నేతగా ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ ప్రతిపాదించారు. ఆ ప్రతిపాదనకు మిగిలిన ఎమ్మెల్యేలంతా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.

### బీజేపీ ఎమ్మెల్యేలతో పురందేశ్వరి భేటీ

మరోవైపు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ ఎమ్మెల్యేల భేటీ జరిగింది. ఎమ్మెల్యేలతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి సమావేశమయ్యారు. శాసనసభాపక్ష నేత ఎంపికపై చర్చించారు. అధిష్ఠానం ప్రకటనకు అందరూ కట్టుబడి ఉండాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ ప్రజలు కూటమిపై విశ్వాసంతో మంచి విజయం అందించారన్నారు. సీఎం ప్రమాణ స్వీకార సభకు ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్‌షా వస్తున్నారని చెప్పారు. రాష్ట్ర భాజపా తరపున తామంతా సభకు హాజరవుతున్నామని తెలిపారు.



# వాళ్ల అవస్థ చూస్తే నవ్వొచ్చింది

సోషల్ మీడియా ప్రభావం పెరిగాక వార్తలు ఎంత వేగంగా వ్యాపిస్తున్నాయో.. అంతకంటే వేగంగా పుకార్లు వ్యాప్తి చెందుతున్నాయి. ప్రస్తుతం చేతిలో సెల్‌ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ జర్నలిస్టే. అలా అయిపోయింది సొసైటీ. ఈ విషయంపై ఇటీవల కత్రినాకైఫ్ స్పందించింది. 'లాస్ట్ మంత్ నా భర్త విక్కీ కౌశల్ పుట్టినరోజును సెలబ్రేట్ చేసుకునేందుకు లండన్ వెళ్లాం. అక్కడ కొన్ని ఫొటోలు దిగాం. ఫొటోగ్రాఫర్ తప్పిదం వల్ల ఆ ఫొటోల్లో నేను గర్భం దాల్చినట్టుగా కనిపించాను. ఇక ఆ ఫొటోలు పట్టుకొని నేను ప్రెగ్నెంట్ అయినట్టుగా వార్తలు రాసేశారు. మేం ఇండియా వస్తున్నామని తెలిసి, నా ఫొటోలకోసం వీరంతా ఎయిర్‌పోర్ట్ ముందు కెమెరాలతో రెడీగా ఉన్నారు. నేను మామూలుగా రావడంతో అందరూ షాక్ అయ్యారు. వాళ్ల అవస్థ చూస్తే నవ్వొచ్చింది. నా ప్రెగ్నెన్సీ గురించి వాళ్లకెందుకు? అది మా సొంత విషయం కదా.. దానివల్ల దేశానికి ఏమైనా ఉపయోగం ఉందా? వార్తలు ఎలా ఉండాలో తెలియని వాళ్లు వార్తలు రాసేస్తున్నారు. అక్కడే వస్తుంది ప్రాబ్లమ్ అంతా' అంటూ చెప్పుకొచ్చింది కత్రినా.

# 18న వారణాసికి మోదీ..

### రైతుల సదస్సుకు హాజరు



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జూన్ 18న ఉత్తరప్రదేశ్‌లోని తన పార్లమెంటరీ నియోజకవర్గమైన వారణాసిలో పర్యటించనున్నారు. అక్కడ జరగబోయే 'కిసాన్ సమ్మేళన్'లో (రైతుల సదస్సు) మోదీ ప్రసంగించనున్నారు. అయితే మూడోసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మోదీ.. వారణాసికి వెళ్లడం ఇదే తొలిసారి కావడం విశేషం. మోదీ పర్యటనపై స్థానిక బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. వారణాసిలోని రోహనియా లేదా సేవాపురి అసెంబ్లీ నియోజకవర్గంలో రైతుల సదస్సుకు వేదిక ఉండనున్నట్లు తెలిపారు. ఈ మేరకు గులాబ్‌బాగ్‌లోని పార్టీ కార్యాలయంలో మహానగర, జిల్లా అధికారుల సమావేశం నిర్వహించారు. వారణాసిలో ఒకరోజు పర్యటన సందర్భంగా దశాశ్వమేధ ఘాట్‌లో గంగా హారతిలో ప్రధాని మోదీ పాల్గొంటారని, అందుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయని కాశీకి చెందిన బీజేపీ అధికారి దిలీప్ పటేల్ తెలిపారు. వారణాసిలో ప్రధాని మోదీకి ఘన స్వాగతం పలికేందుకు సిద్ధం కావాలని బీజేపీ కార్యకర్తలందరికి పిలుపునిచ్చారు.

## పూర్నియా ఎంపీ పప్పు యాదవ్‌పై ఎఫ్ఐఆర్..



బీహార్‌లోని పూర్నియా ఎంపీ పప్పు యాదవ్‌పై ఎఫ్ఐఆర్ నమోదయింది. ఓ ఫర్నీచర్ వ్యాపారిని బెదిరించి డబ్బులు వసూలు చేయడానికి ప్రయత్నించాడన్న ఆరోపణలపై ఆయనపై కేసు రిజిస్టర్ అయింది. లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు రోజున (జూన్ 4న) తన ఇంటికి పిలిపించి రూ.కోటి ఇవ్వాలని డిమాండ్ చేశాడని, లేకపోతే చంపేస్తానని బెదించాడని ఆ వ్యాపారి ఫిర్యాదులో పేర్కొన్నాడు. వచ్చే ఐదేండ్లు తాను ఎంపీగా ఉంటానని హెచ్చరించాడని వెల్లడించాడు. ఈ నేపథ్యంలో జూన్ 10న పూర్నియా జిల్లా పోలీసులు పప్పు యాదవ్‌పై కేసు ఫైల్ చేశారు.



## తాండవిస్తోన్న తాగునీటి సమస్య

దేశ రాజధాని ఢిల్లీలో అనేక ప్రాంతాల్లో తాగునీటి సమస్య తాండవిస్తోంది. స్థానికులు నీటి ట్యాంకర్లపైనే ఆధారపడాల్సిన దుస్థితి నెలకొంది. గతవారం సుప్రీంకోర్టు హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వానికి యమునా నది నుంచి 137 క్యూసెక్కుల అదనపు జలాలను ఢిల్లీకి కేటాయించాల్సిందిగా ఆదేశించింది. అయినా హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం నీటిని విడుదల చేయలేదు. దీంతో ఢిల్లీలోని ప్రజల నీటి కష్టాలు మరింత పెరగనున్నాయి.




## మైనర్‌తో శారీరక సంబంధం అత్యాచారమే

### బాలిక సమ్మతితో జరిగినా అది నేరమే: ఢిల్లీ కోర్టు

బాధితురాలి సమ్మతితోనే జరిగినప్పటికీ మైనర్‌తో శారీరక సంబంధాన్ని కొనసాగించడం అత్యాచార నేరంగానే పరిగణించాల్సి ఉంటుందని దిల్లీ కోర్టు స్పష్టం చేసింది. 14 ఏళ్ల బాలిక గర్భం ధరించడానికి కారణమైన వ్యక్తిని దోషిగా నిర్ధారిస్తూ అదనపు సెషన్స్ జడ్జి అమిత్ సహ్రావత్ ఈ విషయం తెలిపారు. 2015 జనవరిలో నమోదైన ఈ కేసు విచారణ ముగింపు దశకు వచ్చింది. బాలికకు జన్మించిన బిడ్డకు తండ్రి నిందితుడేనని డీఎన్ఏ పరీక్షల్లో తేలింది.



## మర్డర్ కేసులో స్టార్ హీరో దర్శన్ అరెస్ట్

కన్నడ స్టార్ హీరో, 'ఛాలెంజింగ్ స్టార్' దర్శన్ ను కర్ణాటక పోలీసులు అరెస్ట్ చేయడం సంచలనంగా మారింది. మైసూరు పోలీసులు ఆయన్ను తాజాగా అదుపులోకి తీసుకున్నట్లు శాండిల్ వుడ్ వర్గాలు చెబుతున్నాయి. అయితే, ఓ మర్డర్ కేసులో దర్శన్ ను పోలీసులు అరెస్ట్ చేసినట్లుగా తెలుస్తోంది. రేణుక స్వామి అనే వ్యక్తి మర్డర్ కేసులో నటుడు దర్శన్ తో పాటు మరో 10 మందిని పోలీసులు అరెస్ట్ చేసినట్లుగా తెలుస్తోంది. నటి పవిత్ర గౌడకు అసభ్యకరమైన మెసేజ్ లు పంపడం, సోషల్ మీడియాలో ఆమెపై కామెంట్స్ చేయడంతో రేణుక స్వామిని గుర్తుతెలియని వ్యక్తులు హతమార్చినట్లుగా పోలీసులు తెలిపారు. అయితే, పవిత్ర గౌడకు చెందిన ఓ షెడ్ లో రేణుక స్వామి హత్య జరిగినట్లుగా పోలీసులు గుర్తించారు.




## కొత్త బీర్లు ఇప్పట్లో లేనట్లే!?

ఇటీవల కొత్తగా ఐదు మద్యం కంపెనీలకు ఇచ్చిన అనుమతులను రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ తాత్కాలికంగా నిలిపివేసినట్టు సమాచారం. ఈ కొత్త కంపెనీలు 27 రకాల బీర్లను ప్రవేశపెట్టేందుకు రంగం సిద్ధం చేసుకున్నాయి. అయితే ఆ ఉత్పత్తుల నాణ్యతపై అనుమానాలు తలెత్తాయి. సోషల్ మీడియాలో ట్రోల్స్, మద్యం ప్రియుల నుంచి వస్తున్న వ్యతిరేకత కారణంగా పర్మిషన్లకు బ్రేక్ వేసినట్లు తెలుస్తోంది.

## క్షమాపణలు కోరిన పాక్ మాజీ క్రికెటర్

సిక్కులపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు పాకిస్థాన్ మాజీ క్రికెటర్ కమ్రాన్ అక్మల్ క్షమాపణలు చెప్పారు. 'నా కామెంట్స్ పట్ల తీవ్రంగా చింతిస్తున్నాను. హర్భజన్ సింగ్‌తో పాటు సిక్కులందరినీ క్షమాపణ కోరుతున్నా. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సిక్కుల పట్ల నాకు ఎంతో గౌరవం ఉంది. ఎవరినీ కించపరచడం నా ఉద్దేశం కాదు. దయచేసి నన్ను క్షమించండి' అని ఆయన ట్వీట్ చేశారు.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



## చరిత్ర సృష్టించిన సౌతాఫ్రికా

T20WCలో అత్యల్ప స్కోరు(114)ను డిఫెండ్ చేసుకున్న జట్టుగా సౌతాఫ్రికా చరిత్ర సృష్టించింది. నిన్న బంగ్లాపై గెలుపుతో ఈ ఘనత సాధ్యమైంది. ఆ తర్వాతి స్థానాల్లో శ్రీలంక-120(vsకివీస్), ఇండియా-120(vsపాక్), అఫ్గాన్-124(vsవిండీస్), న్యూజిలాండ్-127(vs ఇండియా) ఉన్నాయి. అలాగే పొట్టి ఫార్మాట్‌లో బంగ్లాపై వరుసగా అత్యధిక మ్యాచ్‌లు(9) గెలిచిన రెండో జట్టుగా ప్రొటీస్ నిలిచింది. కివీస్ 10 గెలుపులతో తొలిస్థానంలో ఉంది.




## రవితేజ 75వ చిత్రం ప్రారంభం

ఈ సినిమాను దర్శకుడు హరీష్ శంకర్ తెరకెక్కిస్తుండటంతో ఈ మూవీ పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు క్రియేట్ అయ్యాయి. ఇక రవితేజ తన కెరీర్‌లోని మైల్‌స్టోన్ 75వ సినిమాను ఇప్పటికే అనౌన్స్ చేసిన సంగతి తెలిసిందే. ఈ సినిమాను భాను బోగవరపు డైరెక్ట్ చేస్తున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. కాగా, ఈ సినిమాను పూజా కార్యక్రమంతో తాజాగా ప్రారంభించారు చిత్ర యూనిట్. ఔట్ అండ్ ఔట్ కామెడీ మాస్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది. ఇక ఈ చిత్ర ప్రారంభోత్సవ కార్యక్రమంలో హీరో రవితేజతో పాటు అందాల భామ శ్రీలీల కూడా హాజరయ్యారు. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమాలో రవితేజ పాత్ర ప్రేక్షకులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దనున్నారు. ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చూన్ సినిమాస్, శ్రీకర స్టూడియోస్ బ్యానర్లు సంయుక్తంగా ప్రొడ్యూస్ చేస్తున్నాయి. ఇక ఈ చిత్ర రెగ్యులర్ షూటింగ్ నేటి నుంచి మొదలుపెడుతున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఈ చిత్రానికి వచ్చే సంక్రాంతి కానుకగా రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు.
ఈ సినిమాలోని మిగతా క్యాస్టింగ్ గురించిన వివరాలు త్వరలోనే అనౌన్స్ చేయనున్నారు.



# తెలంగాణ బీజేపీకి కొత్త అధ్యక్షుడు ఎవరు?

లోక్ సభ ఎన్నికల్లో వరుసగా మూడోసారి బీజేపీ విజయం సాధించింది. ఈ నేపథ్యంలో తెలంగాణ బీజేపీ కొత్త అధ్యక్షుడిపై ఊహాగానాలు మొదలయ్యాయి. కిషన్ రెడ్డికి కేంద్రమంత్రి పదవి దక్కడంతో బీజేపీ క్యాడర్ లో చర్చ ఊపందుకుంది. కేంద్రంలో కొత్త ప్రభుత్వం సెలవుతీరింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వంతో పాటు పార్టీ బలోపేతంపై కూడా బీజేపీ హైకమాండ్ ఫోకస్ పెట్టినట్లు సమాచారం. జాతీయ స్థాయిలో బీజేపీ కాస్త బలహీన పడటంతో పార్టీని మళ్లీ గాడిలో పెట్టాలని కమలం పార్టీ నిర్ణయించింది. అందులో భాగంగా వివిధ రాష్ట్రాలకు సంబంధించిన అధ్యక్షులను మార్చాలనే ఉద్దేశంతో జాతీయ నాయకత్వం ఉన్నట్లు సమాచారం. తెలంగాణ నుండి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న కిషన్ రెడ్డి మరోసారి కేంద్రమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంతో, ఇక తెలంగాణలో కూడా నూతన అధ్యక్షుడు రాబోతున్నట్లు పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. ఒక నేతకు ఒకటే పదవి అనే నినాదం బీజేపీలో ఎప్పటి నుండో ఉంది. అయినప్పటికీ గత అసెంబ్లీ ఎన్నికల ముందు బండి సంజయ్ స్థానంలో కిషన్ రెడ్డిని అధ్యక్షుడిగా బీజేపీ అధిష్టానం నియమించింది. సుమారు ఏడాది కాలంగా కేంద్రమంత్రిగా పార్టీ అధ్యక్షుడిగా కిషన్ రెడ్డి రెండు పదవుల్లో కొనసాగుతున్నారు. కిషన్ రెడ్డి మరోసారి కేంద్రమంత్రి కావడంతో బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి మార్పు అనివార్యమైందని సమాచారం. అధ్యక్షమార్పు ఉంటుందని కొత్త అధ్యక్షుడు వస్తాడని, స్వయంగా బీజేపీ చీఫ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేయడంతో అధ్యక్ష పదవి కోసం ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటున్నారు. అధ్యక్ష పదవికోసం ప్రధానంగా ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ, ధర్మపురి అరవింద్, రఘునందన్ రావు పోటీ పడుతున్నట్లు కాషాయ శ్రేణుల్లో చర్చ జరుగుతుంది. బీసీ నేత కావడంతో ఈటలకు బాధ్యతలు కట్టబెట్టే అవకాశాలు కూడా ఎక్కువగా కనిపిస్తున్నాయనే చర్చ పార్టీలో బలంగా వినిపిస్తోంది. ప్రస్తుతం మల్కాజిగిరి ఎంపీగా గెలవడం గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో రెండు సార్లు రాష్ట్ర మంత్రిగా పనిచేయడం తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించడం పార్టీలకతీతంగా విస్తృత పరిచయాలు ఉండడం జాతీయ నాయకత్వంతో, ముఖ్యంగా అమిత్ షా అండదండలు కూడా ఈటల రాజేందర్‌కు కలిసివచ్చే అంశాలని పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. మరోవైపు బీసీ సామాజిక వర్గానికి చెందిన నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ కూడా అధ్యక్ష రేస్‌లో ఉన్నట్లు తెలుస్తుంది. ఒకవేళ ఈటలకు కాకుండా బీసీ సామాజిక వర్గంలో మరో నేతకు ఇవ్వాలనుకుంటే ధర్మపురి అరవింద్‌కు అధ్యక్ష బాధ్యతలు దక్కే అవకాశాలు ఉన్నాయని పార్టీ వర్గాల్లో టాక్ వినిపిస్తుంది. డీకే అరుణ సైతం బీజేపీ అధ్యక్షురాలు రేసులో ఉన్నారనే చర్చ నడుస్తుంది. తాజాగా మహబూబ్‌నగర్ ఎంపీగా డీకే అరుణ ఘన విజయం సాధించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత జిల్లాలో డీకే అరుణ విజయం సాధించటంతో ఆమెకు కేంద్రమంత్రి పదవి దక్కుతుందని భావించారు. కానీ కేంద్ర మంత్రివర్గంలో ఆమెకు స్థానం కల్పించలేదు. దీంతో మహిళా కోట కింద ఆమె అధ్యక్ష రేస్‌లోకి వచ్చే అవకాశాలు ఎక్కువగానే కనిపిస్తున్నాయనే ప్రచారం జరుగుతోంది. దుబ్బాక ఉప ఎన్నికల్లో విజయంతో రఘునందనరావు బీజేపీ హైకమాండ్ దృష్టిలో పడ్డారు. తాజాగా మెదక్ నుంచి రఘునందనరావు ఎంపీగా గెలుపొందారు. ఈనేపథ్యంలో బీజేపీ జాతీయ నాయకత్వం ఆయన పేరును కూడా పరిశీలించే అవకాశాలున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతుంది. ప్రధానంగా బీజేపీ అధ్యక్ష రేస్‌లో ఈటల రాజేందర్, డీకే అరుణ నిలిచే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయని కాషాయ వర్గాల్లో చర్చ జరుగుతుంది. ఈ ఇద్దరు నేతలు గతంలో రాష్ట్ర మంత్రులుగా పనిచేసిన అనుభవం ఉండడం కేంద్ర మంత్రివర్గంలో ఈ నేతలకు స్థానం దక్కకపోవడంతో ఇద్దరు నేతల్లో ఒకరికి అధ్యక్ష బాధ్యతలు అప్పగించే అవకాశాలు ఉన్నాయని బలంగా వినిపిస్తోంది. మరి కొత్త అధ్యక్షులుగా డీకే అరుణ కాబోతుందా..? ఈటెల రాజేందర్ అవుతారా వేచి చూడాల్సిందే.



## చంద్రబాబు రెండో సంతకం దానిపైనే..

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసేందుకు చంద్రబాబు నిర్ణయించుకున్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం సీఎం హోదాలో ఈ చట్టం రద్దుపైనే సంతకం చేయనున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను రెవెన్యూ శాఖ సిద్ధం చేస్తోంది. మంత్రివర్గ సమావేశం ఆమోదం అనంతరం శాసనసభలో చట్టం ఉపసంహరణ బిల్లు ప్రవేశపెట్టనున్నారు. గత ప్రభుత్వం ఈ చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. అధికారంలోకి రాగానే దీనిని రద్దు చేస్తామని టీడీపీ ప్రకటించింది.

**ప్రమాణ స్వీకారం తర్వాత తిరుమలకు చంద్రబాబు**

సీఎంగా రేపు ప్రమాణస్వీకారం చేసిన వెంటనే చంద్రబాబు కుటుంబసమేతంగా తిరుమలకు వెళ్లనున్నారు. భువనేశ్వరి, లోకేశ్, బ్రాహ్మణి, బాలకృష్ణ తదితరులు రాత్రికి అక్కడే బస చేసి 13న ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు. ఎన్నికల్లో ఘన విజయం తర్వాత చంద్రబాబు తొలిసారి తిరుమలకు రానుండటంతో స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు భారీ ఏర్పాట్లు చేస్తున్నాయి.




## ధూపమేసి సెగలు రేపుతున్న విష్ణుప్రియ..

లీవుడ్ గ్లామరస్ యాంకర్స్ లో యంగ్ బ్యూటీ విష్ణుప్రియ ఒకరు. పలు టివి షోలతో విష్ణుప్రియ యువతలో పాపులర్ అయింది.టాలీవుడ్ గ్లామరస్ యాంకర్స్ లో యంగ్ బ్యూటీ విష్ణుప్రియ ఒకరు. పలు టివి షోలతో విష్ణుప్రియ యువతలో పాపులర్ అయింది. నాజూకైన అందంతో సోషల్ మీడియాలో యువతకు గాలం వేస్తోంది. సుడిగాలి సుధీర్ తో కలసి చలాకీగా యాంకరింగ్ చేస్తూ మెప్పించింది విష్ణుప్రియ. ప్రస్తుతం విష్ణు ప్రియా సిసినిమాల్లో కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. విష్ణు ప్రియా తరచుగా బెల్లీ డాన్స్ చేస్తూ ఇంటర్నెట్ లో వైరల్ కావడం చూస్తూనే ఉన్నాం. అంతే కదా తరచుగా విష్ణుప్రియ మ్యూజిక్ వీడియోలు కూడా చేస్తూనే ఉంది. తన అందంతో పొగ పెడుతున్నట్లు గా ఉన్న విష్ణుప్రియ ఫోటోలకు నెటిజన్లు ఫిదా అవుతున్నారు. ఈ తరహాలో గ్లామర్ తో సర్ప్రైజ్ చేయడం విష్ణుప్రియకి మాత్రమే సాధ్యం అంటూ కామెంట్స్ చేస్తున్నారు.



## కల్కి నుండి మరో ట్రైలర్ సిద్ధం!



పాన్ ఇండియన్ మూవీ కల్కి 2898 AD, ఆసక్తిగా ఎదురుచూస్తున్న మైథాలజీ సైన్స్ ఫిక్షన్ డ్రామా, జూన్ 27, 2024న ప్రపంచవ్యాప్తంగా సినిమాల్లోకి రానుంది. రెబల్ స్టార్ ప్రభాస్ మరియు దీపికా పదుకునే ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం యొక్క ట్రైలర్ ఇటీవల విడుదలైంది. ఆన్‌లైన్‌లో భారీ బజ్ సృష్టించింది. చిత్ర నిర్మాతలు 2 నిమిషాల 30 సెకన్ల నిడివి గల అదనపు ట్రైలర్‌ను సిద్ధం చేసినట్లు తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఇది సినిమా ప్రీమియర్‌కి వారం ముందు విడుదల చేయడానికి షెడ్యూల్ చేయబడింది. బృందం నుండి అధికారిక ధృవీకరణ ఇంకా పెండింగ్‌లో ఉన్నప్పటికీ, ఈ కొత్త ట్రైలర్‌లో మొదటి ట్రైలర్‌లోని కొన్ని ఉత్కంఠభరిత సన్నివేశాలతో పాటు, మునుపెన్నడూ చూడని ఫుటేజ్ మరియు పాత్రలు ఉంటాయి. ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్ కథాంశాన్ని గణనీయంగా ప్రభావితం చేసే కీలకమైన పాత్రను పోషించడం జరిగింది. దిశా పటాని, కమల్ హాసన్, మృణాల్ ఠాకూర్, శోభన, రాజేంద్ర ప్రసాద్, పశుపతి మరియు కీర్తి సురేష్ (బుజ్జి) లు కీలక పాత్రల్లో నటించారు. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంను వైజయంతి మూవీస్ బ్యానర్ పై నిర్మించారు.

## నలుగురు అమెరికా టీచర్లపై చైనాలో కత్తితో దాడి

చైనాలో శిక్షణ ఇచ్చేందుకు వెళ్లిన నలుగురు కాలేజీ సిబ్బందిపై అటాక్ జరిగింది. పబ్లిక్ పార్క్‌లో ఉన్న సమయంలో ఓ వ్యక్తి కత్తితో దాడి చేశాడు. అమెరికాలోని ఐయోవా కార్నల్ కాలేజీకి చెందిన ఇన్‌స్ట్రక్టర్లు.. ఓ ప్రోగ్రామ్ నేపథ్యంలో చైనాకు వెళ్లారు. జిలిన్ ప్రావిన్సులో ఉన్న పార్క్‌ను నలుగురు టీచర్లు విజిట్ చేసిన సమయంలో అక్కడ దాడి జరిగింది. బెయిషాన్ పార్క్ సమీపంలో ఉన్న ఓ ఆలయాన్ని విజిట్ చేసినప్పుడు ఓ వ్యక్తి కత్తితో అటాక్ చేశాడు. చైనా వర్సిటీతో భాగస్వామ్యంలో భాగంగా శిక్షణ కోసం తమ కాలేజీకి చెందిన నలుగురు అక్కడకు వెళ్లినట్లు కార్నల్ కాలేజీ తెలిపింది. ఈ



ఘటనపై ఇప్పటి వరకు చైనా అధికారులు స్పందించలేదు. దాడికి సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. ముగ్గురు వ్యక్తులు రక్తపు మడుగులో కిందపడి ఉన్నారు.



## 1,08,273 మంది వాలంటీర్ల పరిస్థితేంటి?

ఎన్నికల ముందు రాజీనామా చేసిన వాలంటీర్ల పరిస్థితి ప్రస్తుతం రెంటికీ చెడ్డ రేవడిలా తయారైంది. YCP అభ్యర్థుల తరఫున ప్రచారం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా 1,08,273 మంది రాజీనామా చేశారు. మళ్లీ YCP అధికారంలోకి రాకపోవడంతో వారి పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. వాలంటీర్లకు నెలకు రూ.10 వేల జీతం ఇస్తామని ప్రచారంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. కానీ రాజీనామా చేసినవారికి తిరిగి ఉద్యోగం రాకపోవచ్చు.

## కేవైసీ ఉంటే చెక్ అవసరం లేదు!

ఉద్యోగుల క్లెయిమ్‌లు తిరస్కరణకు గురికాకుండా ఈపీఎఫ్‌వో మరో వెసులుబాటు కల్పించింది. చందాదారుడి బ్యాంక్ ఖాతాకు ఆధార్ ఈకేవైసీ పూర్తయితే క్లెయిమ్ సమయంలో చెక్, పాస్‌బుక్ కాపీలు జత చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఈమేరకు క్లెయిమ్ దరఖాస్తు సమయంలో నోట్ కనిపిస్తుందని తెలిపింది. దీంతో ఈపీఎఫ్ క్లెయిమ్‌లు సత్వరం పరిష్కారం అవుతాయని సంస్థ భావిస్తోంది.

